ఓంశ్రీసాయిరాం

వ్యక్తులద్వారా సమాజముయొక్క పురోగతిని సాధించు మార్గమే భారతసంస్కృతియొక్క విశిష్టత. సమష్టి స్వభావము, సమష్టి స్వరూపము, సర్వభూతహితము, లోకసంగ్రహము వీటినే భారతీయ ఋషులు ప్రధానముగా ఉపదేశించి ఆచరించిరి. మనుస్మృతి, నారదస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి మొదలైన స్మృతులు సమష్టి జీవితమును వ్యక్తులద్వారా తీర్చిదిద్దుటకు ప్రధానాధారములైన క్రమశిక్షణలను శాసనముగా విధించినవి. వీటినే శాస్త్రమందురు. ఒక వంగదేశమందు తప్ప మిగిలిన రాష్ట్రములప్రజలంతా మితాక్షరమనే శాస్త్రపద్ధతిలోనే తమ సామాజిక బాధ్యతలను నెరవేర్చుచూ వచ్చారు. వంగదేశమందు దాయభాగమనే పరిష్కృత పద్ధతి అమలులో వుండినది. అయితే ఇపుడు కాలమార్పు వలన ఒక్కొక్క రాష్ట్రమునకు ప్రత్యేకమైన శాసనముండవలెననే వాంఛ బయలుదేరినది. అయితే ఎవరేమి చేసిన కర్మజిజ్ఞాస, ధర్మజిజ్ఞాస, బ్రహ్మజిజ్ఞాసలో శతశతమాన కాలము మునిగియున్న భారతదేశమందు ధర్మమే నిండి నిబిడీకృతమై తాండవమాడును. సందేహములేదు. పరిశుద్ధాంతఃకరణమునుంచి ఆవిర్భవించిన ఉత్తమ భావములే మన ధర్మశాస్త్రము.

రతి, ప్రాప్తి, ఆనందము అనే మూడు ప్రేరణశక్తులు మానవుని వెంటాడును. వీటిననుసరించి తమోగుణము రజోగుణము సత్వగుణము, సుషుప్తి స్వప్నము జాగ్రత్ అనే అవస్థలుకూడ. వీటియొక్క నీడగా భయము. మహాభయము మృత్యువు కూడ మానవుని అజ్ఞానాంధకారమున కాకర్షించును. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అనే శక్తులుకూడ రతి, ప్రాప్తి, ఆనందము అనే స్వభావాలకు పోషకముగా దానివలనే భక్తిమార్గము, కర్మమార్గము, జ్ఞానమార్గము మానవునికి అలవడుచున్నవి.

చిన్న పిల్లలు పూలను పట్టుకొందురు, నిప్పునూ పట్టుకొందురు. వారికి అవి ఆకర్షణ. కానీ, వాటిపై అంత బలమైన వాంఛ లేదు. ప్రాప్తి నిమిత్తమై రతి లేదు. పెద్దలకు ప్రాప్తి సహితమైనదే ఆనందము. బాలోన్మత్త 'జ్ఞానీ బాలోన్మత్త పిశాచవత్' అంటారు. చిన్నపిల్లలు పిచ్చివాడు జ్ఞాని పిశాచము పట్టినవాడు అందరికీ ఇదికావాలి అదికావాలి అని ప్రాప్తి కొరకు పట్టుదల లేదు. చిన్న పిల్లల జోబిలను పరీక్షించండి. ఇసుక, రాళ్లు, గాజుముక్కలు ఇవే దొరకును. దానితోనే అమితానందమును అనుభవింతురు. పెద్దలకు తమ జోబినిండా కట్ట కట్టలు నోట్లున్న కూడ అంత ఆనందముండదు. మట్టిలో ఆడేవాళ్ళకు హాయి, విశ్రాంతి. అయితే, దేహములో మాలిన్యముండిన మనస్సు నిర్మలము. పెద్దలకు దేహము నిర్మలమైననూ మనస్సు మాలిన్యపూరితముగా వుండును. భోగులు యెపుడూ తక్కువ శ్రమమునకు యెక్కువ ఫలితము నాశింతురు. కాబట్టి, వారికి నిరాశ, అశాంతి. యోగులు శ్రమము అధికమైననూ తక్కువ ఫలితమునే యెదురు చూచుదురు. కాబట్టి, వారికి ఆనందము, శాంతి. నిర్మలత్వమందే ఆనందము. అదే నిజమైన మానవధర్మము. అదే విముక్తి సాధన. మమత్వము పశులక్షణము. అది రక్తిని పెంచి పెద్ద చేయును. ఆనంద ప్రాప్తికై భగవద్రతిని అభివృద్ధి చేసుకొనేవారే ధన్యులు.

నయాపైసా వెలయుండవచ్చు, ఆ కవరుకు. దానిలోపల చిన్న పిల్లవాడు వంకరటింకరగా అక్షరములు వ్రాసియుండ వచ్చును. అయిననూ, పోస్ట్‌మ్యాన్ ఆ జాబును యిచ్చిన తక్షణమే తల్లి సర్వ పనులనూ వదలి కండ్లనిండ ఆనందబాష్పములతో చదివి చాలా సంతోషించును. ఐదు రూపాయల విలువగల మంచి కవరులో సువర్ణాక్షరమున తుచ్ఛమైన విషయములను ఆనందముగా ప్రింటు కొట్టి పంపినకూడ దానిని ఆ తల్లి చింపివేయును. కాని, చదివి ఆనందించదు. తల్లీ కుమారుల ప్రేమ అటువంటిది.

అట్లనే దేహముపై రుద్రాక్షమాలలు కంకణములు ధరించి, జటలను పెంచి ఆడంబర వేషముతో ఆర్భాటము చేసుకొని వేదశాస్త్ర పురణేతిహాసములలోని శ్లోకాలను పఠించిన అవన్నీ కవర్లు మాత్రమే. లోపల జాబులోని విషయ వివరాలు తుచ్ఛమైనవా ఉత్తమమైనవా, ప్రేమపూరితమైనవా రాగద్వేషాదులతో కలుషితమైనవా అని లోకమాత పరీక్షించును. ఉత్తమ భావాలతో నిండిన జీవితమైతే ఆనందపడును. అవి లేనియెడల ఛీ! ఛీ! అని అసహ్యపడును. ఎన్ని విద్యలు నేర్చిన, పదవులు ఏలిన, ప్రతిష్ఠలు పొందిన తన దేహమాతను ఆ లోకమాతను ఆనందింపక, కృజ్ఞతను అందించక, స్వల్ప విషయానికే ఉప్పొంగిపోయే ఆ తల్లులను ప్రీతించక, వాళ్ళను సంతృప్తి పరచక జీవించిన, ఆ జీవితము వ్యర్థమే, సందేహము లేదు.

(1972 నవంబరు 24వ తేదీ భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)